గిరిజన రైతుకు పట్టా పాస్‌బుక్ అందజేత

ఉట్నూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు నిర్వహించిన ఐదు సంవత్సరాల తర్వాత పట్టా పాస్‌బుక్ గిరిజన రైతుకు అందింది. మండల కేంద్రంలోని ఉట్నూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఇంద్రవెల్లి మండలంలోని హర్కాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ తుకారాం (తండ్రి :నక్కు)కు సర్వే నంబర్ 59/3/1లో 1.25 ఎకరాలు మరియు సర్వే నెంబర్ 59/3/2లో 1.33 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమికి స ంబంధించిన పట్టా పాస్‌బుక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఏఓ భీంరావ్, సెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు షురూ

- జైనథ్‌లోని అతిపురాతన ఆలయంలో
- 10 రోజుల పాటు జాతర కార్యక్రమాలు

ఆదిలాబాద్(జైనథ్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి 18 కి.మీ.ల దూరంలో ఉన్న అతి ప్రాచీన లక్ష్మీనారాయణ స్వామి వారి ఆలయంలో ప్రతీయేడాది మాదిరిగానే శనివారం స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి వారికి పుణ్యహవచనం, అంకురారోపణం, అగ్నిప్రతిష్ఠను నిర్వహించారు. దీంతో పాటు నవంబరు 2న ధ్వజారోహణం, స్వాముల దీక్ష విరమణ, స్వామివారం కల్యాణోత్సవం, 3న సోమవారం హసనము, బలిహారణం, తీర్థ ప్రసాద వియోగం, 4న నిత్యావాచన, బలిహారణం తీర్థ ప్రసాద వియోగం, 5న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, చిన్న రథం పై శేషవాహనం పై స్వామివారి ఊరేగింపు, 6న గజవాహనంపై ఊరేగింపు, 7న అశ్వవాహనంపై ఊరేగింపు, 8న హనుమంత్ వాహనంపై ఊరేగింపు, 9న గరుడ వాహనం సేవ, పొన్నచెట్టు సేవ, 10న పెద్దరథం పై ఊరేగింపు, పది రోజుల పాటు జాతర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

● జైనథ్‌లో గల అతిపురాతన లక్ష్మీనారాయణ స్వామి ఆలయం(ఇన్‌సెట్ మూలవిరాట్టు)

4 నుంచి దీర్ఘకాల సెలవుల్లోకి ఐటీడీఏ పీవో

- ఇన్‌చార్జిగా అదనపు కలెక్టర్


ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా అదనపు కలెక్టర్ రాజేశ్వర్

ఉట్నూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా దీర్ఘకాల సెలవులో వెళ్తుండడంతో అదనపు కలెక్టర్ రాజేశ్వర్‌కు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆదేశాలు జారీ చేశారు. మెటర్నటి సెలవు మంజూరు కావడంతో ఈ నెల 4 నుంచి మే నెల 3 వరకు అదనపు కలెక్టర్ రాజేశ్వర్ ఇన్‌చార్జీ ప్రాజెక్టు అధికారిగా వ్యవహరించనున్నారు.

రేపు డీజిల్‌కు వేలం

ఇచ్చోడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల పోలీస్ స్టేషన్‌లో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న డీజిల్‌కు సోమవారం ఉదయం 10గంటలకు వేలంపాట ఉంటుందని ఎస్సై పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ముందుగా పోలీస్ స్టేషన్‌లో పేరు నమోదు చేసుకోవాలని, మొత్తం 630 లీటర్ల డీజిల్‌కు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

ఉట్నూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామీణ ప్రాంతాల రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రాలు ప్రారంభించాలని ధాన్యం రైతులు కోరుతున్నారు. ఉట్నూర్ మండలానికి బీర్సాయిపేట, దంతనపల్లి, ఉట్నూర్ ప్రాంతాలలో 4 ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు మంజూరు చేసినందున వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే ధాన్యం నిలువలు అమ్ముకుంటామని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే అకాల వర్షం పడుతుండడంతో ఆర బెట్టిన ధాన్యం తడిచి పోతుందని వెంటనే అధికారులు ప్రజా ప్రతినిధులు రైతుల సమస్య పరిష్కారం కోసం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.



లిక్కర్ షాప్స్.. రీ సేల్స్!

2025-27 మద్యం పాలసీలో.. భాగంగా ఏ-4 మద్యం దుకాణాలను దక్కించుకున్న వారంతా మళ్లీ రీ సేల్స్ చేస్తూ రూ.లక్షలను వెనుకేసుకుంటున్నారు. లిక్కర్ వ్యాపారంలో ఎలాంటి అనుభవం, ఆర్థిక స్థోమత లేని వారు కూడా లక్కీ డ్రాలో దుకాణాలను దక్కించుకున్నారు. దీంతో లిక్కర్ వ్యాపారులు యజమానుల చుట్టు చక్కర్లు కొడుతున్నారు.

చేతులు మారుతున్న మద్యం దుకాణాలు

- జిల్లాలో దక్కించుకున్న యజమానుల చుట్టూ వ్యాపారుల చక్కర్లు
- సేల్స్‌ను బట్టి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఆఫర్
- జోరుగా లిక్కర్ వ్యాపారుల సిండికేటు దందా
- అంతా తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ

ఆదిలాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించిన షాపులపై కొంత మంది వ్యాపారులు కన్నేస్తున్నా రు. జిల్లాలో 40 మద్యం షాప్‌లకు అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. దీంతో కొన్ని షాపులకు భారీగా దరఖాస్తులు రావడంతో 34 దుకాణాలకు లక్కీ డ్రాను నిర్వహించి షాపులను కేటాయించారు. మరో ఆరు షాపులకు దరఖాస్తులు తక్కువగా వచ్చాయన్న కారణంగా తిరిగి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. శనివారం దరఖాస్తులకు చివరి గడువు కావడంతో ఆరు మద్యం షాపులకు 30కి పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తుంది. అయితే ముందుగా లక్కీ డ్రాలో దుకాణాలను దక్కించుకున్న యజమానులతో వ్యాపారులు రాయ'భేరం' చేస్తూ సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే కొన్ని మద్యం షాపులను అమ్మేసుకున్నట్లు తెలుస్తుంది.మొత్తానికి జిల్లాలో కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు చేతులు మారుతున్నాయి. డిసెంబరు 1 నుంచి కొత్తమద్యం పాలసీ అమలులోకి రావడడంతో వ్యాపారుల్లో కొంత హడావుడి కనిపిస్తుంది.

సిండికేటుగా దరఖాస్తులు

లిక్కర్ వ్యాపారులు తెలివిగా ముందే సిండికేటుగా ఏర్పడి మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేశారు. 20 నుంచి 50 మంది వరకు ఒక్కో గ్రూపుగా ఏర్పడ్డారు. లక్కీ డ్రాలో ఎవరికి దుకాణం దక్కినా అందరు సమానంగా వాటాలు పంచుకునే విధంగా ఒప్పందం చేసుకున్నారు. ముందుగా అనుకున్నట్లుగానే ఒక్కో గ్రూపునకు ఒకటి రెండు మద్యం షాపులు దక్కాయి. దీంతో కుదురితే పాట్నర్ షిప్ లేదంటే వాటాలను పంచుకునేందుకు మంతనాలు జరుపుతున్నారు. ఇప్పటికే దుకాణాలను దక్కించుకున్న యజమానుల చుట్టూ చక్కర్లు కొడుతున్న వ్యాపారులు డబ్బుతో మభ్యపెడుతున్నారు. లిక్కర్ వ్యాపారంలో చాలా రకాల ఇబ్బందులు ఉంటాయంటూ నమ్మబలుకుతున్నారు. కొందరు వ్యాపారులైతే మంచి పలుకుబడి ఉన్న వ్యక్తులతో రాయబారం నడుపుతున్నారు.

గుడ్‌విల్‌తో ఆఫర్

మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు లిక్కర్ వ్యాపారులు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో దుకాణానికి రూ.50 లక్షల నుంచి కోటి రూపాయల గుడ్‌విల్‌ను ఇచ్చేందుకు ఆఫర్ చేస్తున్నారు. ముఖ్యంగా లిక్కర్ సేల్స్‌ను బట్టి ధరలను నిర్ణయిస్తున్నారు. మద్యం దుకాణాన్ని అప్పగిస్తే కొంత

(తరువాయి 6వ పేజీలో....)

మా దృష్టికి రాలేదు

: విజయేందర్, ఎక్సైజ్ సీఐ, ఆదిలాబాద్ సర్కిల్

లక్కీ డ్రాలో దుకాణాలను దక్కించుకున్న యజమానులు తిరిగి అమ్మేసుకుంటున్నారన్న విషయం మా దృష్టికి రాలేదు. ఒక వేళ అమ్ముకున్న లక్కీ డ్రాలో దక్కించుకున్న యజమాని పేరిటనే లైసెన్సులు జారీ చేయడం జరుగుతుంది. దీనిపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. రెండేళ్ల పాటు మద్యం షాపును నిర్వహించే బాధ్యత టెండర్ దక్కించుకున్న వారి పైననే ఉంటుంది.

పెండింగ్ మద్యం దుకాణాలకు ముగిసిన టెండర్‌లు

- చివరి రోజు భారీ స్పందన

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): లక్కీ డ్రా వాయిదా పడ్డ మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. జిల్లావ్యాప్తంగా ఉన్న నలభై దుకాణాలకు గాను 34 దుకాణాలకు సంబంధించి లక్కీ డ్రాను ఇటీవల కలెక్టర్ రాజర్షి షా సమక్షంలో నిర్వహించారు. అయితే ఆరు దుకాణాలకు పది కంటే తక్కువ దరఖాస్తులు రావడంతో వాటికి తిరిగి టెండర్లను స్వీకరించారు. ఇందులో ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలోని 16,17,18, ఇచ్చోడ స్టేషన్ పరిధిలోని 25, 28, ఉట్నూర్ పరిధిలోని 40వ నంబర్ దుకాణాలు ఉన్నాయి. వీటికి పది కంటే తక్కువ టెండర్‌లు రావడంతో డ్రా ను వాయిదా వేసి దరఖాస్తులను స్వీకరించారు. ఇక ఈ ప్రక్రియ శనివారంతో ముగియగా.... చివరి రోజు నాటికి 88 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. చివరి రోజే 59 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల మూడవ తేదీన జడ్పీ సమావేశ మందిరంలో వీటికి లక్కీ డ్రా నిర్వహించనున్నారు. దీంతో 2025-27 మద్యం పాలసీకి సంబంధించి దుకాణాల కేటాయింపు పూర్తి కానుంది. కొత్తగా దుకాణాలు దక్కించుకున్న వారు ఈ ఏడు డిసెంబర్ ఒకటవ తేదీ నుంచి ప్రారంభించనున్నారు.


విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్ జీడీసీకి రాష్ట్ర స్థాయి అవార్డు

ఉట్నూర్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం, కమిషనర్ కళాశాల, విద్యాశాఖ నిర్వహించిన జిజ్ఞాస ప్రాజెక్టుకు ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి తెలుగు విభాగానికి రాష్ట్రస్థాయిలో అవార్డు లభించిందని ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ తెలిపారు. అందుకు గాను శనివారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా రూ.12 వేల నగదు పురస్కారంతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. తెలుగు విభాగం అధ్యాపకులు జె.యోగలక్ష్మి మార్గదర్శకత్వంలో 'ఆదిలాబాద్ జిల్లా తోటీలు-జీవన స్థితిగతులు' అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టు మొదట రాష్ట్రస్థాయి 24 ఉత్తమ ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచిందని, ఆ తర్వాత హైదరాబాద్‌లో 24 ప్రాజెక్టులు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో ఉట్నూర్ ప్రభుత్వ కళాశాల తృతీయ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ తెలిపారు. యోగలక్ష్మి, విద్యార్థులు హారిక, శిరీష, శంకర్, అంజలి, గిరిజలను పీవో, ప్రిన్సిపాల్, ఐక్యూఏసీకో ఆర్డినేటర్ సాయిప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

అల్లాడుతున్న అన్నదాతకు పట్టింపు కరువాయే

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామన్న

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, తేమ శాతం నిబంధనలతో అన్నదాతలు అల్లాడుతుంటే పట్టించుకున్న నాథుడు కరువయ్యారని, రైతుల ఇక్కట్లను పట్టించుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మండిపడ్డారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని ప్రభుత్వాల విధానాలపై ధ్వజమెత్తారు. జిల్లావ్యాప్తంగా ఈయేడు భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో విపత్తు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీని ద్వార రుణాల రీ షెడ్యూల్ జరిగి రుణాలు దక్కే అవకాశముందని అన్నారు. పత్తి కొనుగోళ్లలో తేమ శాతం నిబంధనలతో అన్నదాతలకు కనీస మద్ధతు ధర దక్కడం లేదని వివరించారు.

జిల్లాలో పర్యటనకు శిక్షణ అధికారుల బృందం

- జిల్లా విశేషాలు, పర్యటన వివరాలను వెల్లడించిన కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్‌లోని శిక్షణ ఐఏఎస్, ఐఆర్ఎస్, ఐపీఎస్, ఐఈఎస్, ఐఎస్ఎస్ అధికారుల బృందం జిల్లాకు పర్యటన నిమిత్తం చేరుకుంది. ఈ సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. పర్యటనకు వచ్చిన 16 మంది శిక్షణ అధికారులకు స్వాగతం పలికి వారిని పరిచయం చేసుకున్నారు. నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామం, తాంసి మండలంలోని బండల నాగపూర్, తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామాల్లో మూడు బృందాలుగా విభజించి పర్యటన నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో కూడా క్షేత్ర స్థాయి పరిశీలన చేయనున్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, పారిశుధ్యం, వ్యవసాయం, జీవనోపాధి తదితర అంశాలపై అధికారులు అధ్యయనం చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లా గురించి వివరిస్తూ, తెలంగాణ కశ్మీర్‌గా పిలువబడే జిల్లాలో వివిధ మతాలు, కులాల ప్రజలు సామరస్యంగా జీవిస్తున్నారని చెప్పారు. కొమురం భీంను ఆదివాసీలు తమ ఆరాధ్య దైవంగా భావిస్తారని, పత్తి సాగు ప్రధానంగా జరుగుతున్న రైతు ఆధారిత జిల్లా అని తెలిపారు. జిల్లాలో అమలవుతున్న ముఖ్యమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ఆర్‌ఓఎఫ్‌ఆర్, రేషన్ కార్డులు తదితర పథకాలపై శిక్షణ అధికారులకు వివరాలు అందజేశారు. క్షేత్ర పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, పర్యటన ముగింపులో అధ్యాయన ఫలితాలపై సూచనలు ఇవ్వాలని అధికారులను కోరారు. ఇందులో అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు ఎస్పీ కాజల్, శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ కోఆర్డినేటర్ స్వామి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆయా అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా


పాల్గొన్న అధికారులు

స్వయం ఉపాధి దిశగా యువత ముందుకు రావాలి

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్): ప్రభుత్వం అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి అవకాశాలను యువత పూర్తిగా వినియోగించుకోవాలని కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టీటీడీసీ భవనంలో నిర్వహించిన ఇందిరమ్మ సెంట్రింగ్ యూనిట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాయని వారు పేర్కొన్నారు. శిక్షణ పొందిన యువత నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించుకుని స్వయం ఉపాధి సాధించాలని సూచించారు. నిర్మాణ రంగంలో నైపుణ్యం కలిగిన కార్మికులను తీర్చిదిద్దడంలో శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కష్టపడి నేర్చుకుంటే ప్రతీ ఒక్కరికి ఉపాధి అవకాశాలు తప్పక లభిస్తాయని, జిల్లాలో ఇలాంటి మరిన్ని శిక్షణా కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా మాట్లాడుతూ శిక్షణ యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తోందని, మహిళలు కూడా ఈ రంగంలో ముందుకు రావాలని వారు ఈ సందర్భంగా సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో రవీందర్ రాథోడ్, న్యాక్ ఏడీ స్వప్న రాణి, అధికారులు పాల్గొన్నారు.

'జాగృతి జనం బాటను విజయవంతం చేయాలి'

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ జాగృతి కల్వకుంట్ల కవిత తలపెట్టిన జాగృతి జనం బాటను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ చారి అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాలో నవంబరు 3, 4వ తేదీల్లో కల్వకుంట్ల కవిత పర్యటించనున్నారని, జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిశీలించి.. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను సందర్శించనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. మేధావులతో సమేకమై సమస్యల కార్యాచరణకు సిద్ధం అవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున జిల్లా ప్రజలు హాజరవాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మేక లలిత యాదవ్, సంగీత రెడ్డి, తెలంగాణ జాగృతి బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారన్న, తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు వేణుగోపాల్ యాదవ్, రంగినేని శ్రీనివాస్, ప్రమోద్, సాయి పాల్గొన్నారు.

భవితలో ఆయా పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బజార్‌హత్నూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో కాంట్రాక్టు పద్ధతిన ఆయాగా పని చేయడానికి అర్హత గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి రాంకిషన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణురాలైన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, పదవ తరగతి మెమో జిరాక్స్ కాపీ, బ్యాంకు అకౌంట్, రెండు పాస్ ఫోటోలతో స్థానిక విద్యాధికారికి ఈ నెల 10 లోపు దరఖాస్తులు అందించాలని కోరారు.

గ్రామాల్లో మూఢ నమ్మకాలపై అవగాహన


బోరిగామలో శీతాకాల శిబిరంలో భాగంగా గ్రామంలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఇచ్చోడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని బోరిగామ గ్రామంలో శీతాకాల ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సేవా పథకం ప్రత్యేక శీతాకాల శిబిరం కార్యక్రమంలో భాగంగా ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గ్రామంలో అవగాహన సదదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా మూఢనమ్మకాలు, బాల్యవివహాలు, ఇంటింటా ఇంకుడుగుంతలు, మరుగుదొడ్ల ప్రాధాన్యత, శుచిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సత్యనరాయణరావ్, ప్రభాకర్ రెడ్డి, సోమన్న, బాలాజీ, గంగాధర్, భీంరావ్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

● ఎన్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో..

బోథ్: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ప్రత్యేక శీతకాల శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.శంకర్‌తో పాటు మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి మండల విద్యాధికారి ఎండీ హుస్సేన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఎన్‌ఎస్ఎస్ కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. దీనిలో భాగంగా మూఢ నమ్మకాల పట్ల ప్రజలను చైతన్యం చేయాలని విద్యార్థులకు సూచించారు. అంతేకాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా గ్రామస్థులకు వివరించాలన్నారు. గంజాయి సేవనం, డిజిటల్ మోసాలపైన గ్రామస్థులకు అవగాహణ కలిగించారు. ఈ విషయంలో ప్రజలు చైతన్యవంతంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, నవీన్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారి నగేష్‌లు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం మాటలు అర్థరహితం


ఉట్నూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఉట్నూర్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాకిస్తాన్ భారత్ పై దాడి చేసినా, భారత్ ప్రతి స్పందించ లేదు అన్న వ్యాఖ్యలు భారతదేశ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని, అర్థరహితమని బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఉట్నూర్ మండల అధ్యక్షులు బింగి వెంకటేశ్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, రాష్ట్ర నాయకులు టేకం హరిప్రసాద్, సాడిగే రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ కందుకూరి రమేష్, సాల్గరే రవీందర్, దేవిదాస్, కాలేరి గంగాధర్, ఉగ్గేవిజయ్, కొత్త సత్యనారాయణ, విజయ్, శశి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలలో మాక్‌పోలింగ్

ఉట్నూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం మాక్‌పోలింగ్ నిర్వహించినట్లు హెచ్‌ఎం జ్యోతి తెలిపారు. విద్యార్థులు పీవో, ఓపీవో, పోలింగ్ ఏజెంట్స్‌గా ఎన్నికలను సజావుగా జరిపించారన్నారు. ఇందులో మొత్తం 8 మంది పాల్గొనగా అందులో హెడ్‌బాయిగా విజేష్ 7వ తరగతి, హెడ్ గర్ల్‌గా హాసిని 7వ తరగతి విజయం సాధించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని పరామర్శించిన మాజీ ఎంపీపీ

బోథ్, నవంబర్1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి హరీశ్‌రావు తండ్రి ఇటీవల మృతిచెందడంతో మాజీ మంత్రిని బోథ్ మండల మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన హరీశ్‌రావు తండ్రి మృతి గల కారణాలను అడిగి తెలుసుకుని శ్రద్ధాంజలి ఘటించారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో దళారులను నమ్మొద్దు

బోథ్, నవంబర్1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ముందుకు వచ్చి ఇళ్లను నిర్మించుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో మధ్యవర్తులు కాంట్రాక్టర్లను అనుమతించబోమని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కుసులాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు పనులను అప్పగిస్తే నాసిరకంగా చేపట్టి అస్కారం ఉందని పేర్కొన్నారు. నాసిరకమైన పనులు జరిగితే బిల్లులు సైతం చెల్లించబోరని ఆయన పేర్కొన్నారు. ఎంపీడీవో వెంట ఎంపీ ఈవో అతుల్‌కుమార్, గ్రామ కార్యదర్శి అశోక్, మాజీ సర్పంచ్ వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


కుసులాపూర్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

రైతు సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

తలమడుగు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ అన్నారు. సీపీఐ పార్టీ తలమడుగు మండలం మహాసభ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని కుచ్చిలాపూర్, పల్సికే, లాల్‌గడ, లక్ష్మంపూర్, మల్కాపల్లి, సాయిలింగి, సుంకిడి, ఉండం కోడడ్ పలు గ్రామాల్లో తిరిగి ప్రచారం


సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు లేవు, పండించిన పంటకు సెక్యూరిటీ లేదు , వీళ్ళ సీసీఐ ద్వారా తేమ శాతం నిబంధన పెట్టి 8 నుంచి 12 వరకు ఉంటేనే కొనడం లేదంటే కేంద్ర ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోలు చేయకపోవడం ఇది విడ్డూరంగా ఉందన్నారు. రైతులు ఆదుకోవడానికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని , కొనుక్కుంటే లాభాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు గణేష్, సీపీఐ నాయకులు కిషన్ పాల్గొన్నారు.

'నిందితులను శిక్షించాలి'

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌టౌన్), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం నేత, రైతు సంఘం రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి లంక రాఘవులు డిమాండ్ చేశారు. ఇటీవల హత్యకు గురైన రామారావు, అనారోగ్యంతో మృతిచెందిన పశ్చిమ గోదావరి జిల్లా పార్టీ నేత బాబురావు లకు నివాళి అర్పించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి సమర్పించారు. కార్యక్రమంలో మంజుల, ఆశన్న, జమున పాల్గొన్నారు.

టీకాలతో పశువులకు ఆరోగ్యం


టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి రాథోడ్ జీవన్

నేరడిగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు పశు పోషకులు సద్వినియోగం పర్చుకోవాలని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. గాలికుంటూ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కుప్టి గ్రామంలో పశువులకు ఉచిత టీకాలు వేశారు. అనంతరం అయన మాట్లాడుతూ పశువులకు టీకాలు వేయడం వలన ఆరోగ్యంగా ఉంటాయని పశు పోషకులు కార్యక్రమాన్ని సద్వినియోగ పర్చుకోవాలని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు.

పాఠశాలకు స్వాగత తోరణం

నేరడిగొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గారం. బి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పాఠశాలకు స్వాగత తోరణాన్ని ఏర్పాటు చేయగా ఉపాధ్యాయులు ప్రారంభించారు. .నూతనంగా ఏర్పాటు చేసిన స్వాగత తోరణంతో పాఠశాలకు అందం సమకూరిందని ప్రధానోపాధ్యాయురాలు రాథోడ్ సునీత అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చదువుకునేలా అన్ని హంగులతో పాఠశాలను తీర్చిదిద్దడంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన రైతు బిడ్డ

బజార్ హత్నూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బజార్ హత్నూర్ మండలంలోని చందూ నాయక్ తండాకి చెందిన రైతు బిడ్డ పడ్వాల్ ధీరజ్ యంబీబియస్ సీట్ సాధించి తన సత్తా చాటాడు. చందునాయక్ తాండాకి చెందిన దూర్పత బాయి ప్రకాష్ దంపతుల కుమారుడు వ్యవసాయ కుటుంబం నుంచి యంబీబియస్ సీట్ సాధించడంతో బంధువులు, గ్రామస్తులు శనివారం స్వగ్రామంలో శాలువాతో సత్కరించారు. కాగా ధీరజ్ ఇచ్చోడాలోని వివేకానంద స్కూల్‌లో పదవ తరగతి చదివి హైదరాబాద్‌లోని శ్రీచైతన్యలో ఇంటర్ పూర్తి చేశాడు. అక్కడే ఏడాది పాటు కోచింగ్ తీసుకుని సిద్దిపేట జిల్లా సురభి ఇన్స్టిట్యూట్ ఎఫ్ మెడికల్ సైన్స్‌లో నీట్‌లో మంచి ర్యాంకు సాధించి ఏంబీబీఎస్ సీటు సాధించినట్లు ధీరజ్ వివరించారు. తల్లిదండ్రులు పడుతున్న కష్టం చూసి పెరగడం వల్లనే మొదటి ప్రయత్నంలోనే ఎంబిబిఎస్ సీటు సాధించానని ధీరజ్ చెప్పారు. తన ప్రయత్నానికి తల్లిదండ్రులు, మిత్రులు, గ్రామస్తుల సహకారం మరువలేనిదని సంతోషం వ్యక్తం చేశాడు.

గాలికుంటు వ్యాధి టీకాలు తప్పక వేయించాలి

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లోకారి గ్రామంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశు వైద్య సిబ్బంది వేశారు. ఈ సందర్భంగా యాపల్‌గూడ డీవీఏహెచ్‌ఓ రామరావు మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు విధిగా వేయించాలన్నారు. ఈ వ్యాధి సూకితే పాల ఉత్పత్తి తగ్గిపోవడమే కాకుండా వ్యాధి తీవ్రమైతే పశువులు మృతి చెందే ఆస్కారం కూడా ఉందన్నారు. వ్యాధి మొదటి దశలోనే గుర్తించి టీకాలు వేయించడం ద్వారా పశువులను కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో యాపల్‌గూడ పశు వైద్యులు డాక్టర్ సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు ఇమ్యునైజేషన్ టీకాలు

నార్నూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యపరంగా చిన్న పిల్లల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం తల్లిదండ్రుల పైన ఉంటుందని హెల్త్ సూపర్‌వైజర్ చవాన్ చరణ్ దాస్ అన్నారు. శనివారం మండలంలోని ఎంపల్లి తండా(కే)లో చిన్న పిల్లలు టీకాలు ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య శాఖ సూచనల మేరకు ప్రతి బుధవారం ఇమ నైజేషన్ డ్రైవ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం శ్యాం పాల్గొన్నారు.

నేడు రైతు వేదికలో సమావేశం

బోథ్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని రైతువేదికలో ఆదివారం ఉదయం రైతులతో కలిసి పంట కొనుగోలు విషయమై చర్చించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజుల పోతన్న పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సోయాబీన్ మొక్కజొన్న పంట కొనుగోలు పైన రైతులతో చర్చించి రైతుల నిర్ణయాన్ని ప్రభుత్వానికి వివరించే విధంగా కార్యక్రమంలో చర్చించే అస్కారం ఉందన్నారు.

లిక్కర్ షాప్స్.. రీ సేల్స్!

(5వ పేజీ తరువాయి...)

పాట్నర్ షిప్‌తో పాటు నగదును ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ మద్యం షాపుకు రూ.65 లక్షలను చెల్లించినట్లు తెలుస్తుంది. లిక్కర్ వ్యాపారంలో మంచి అనుభవం, ఆర్థిక పలుకుబడి ఉన్న ఓ బడా వ్యాపారికి లక్కీ డ్రాలో ఆశించిన స్థాయిలో దుకాణాలు దక్కక పోవడంతో కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. యజమానులు ఏ డిమాండ్ చేసినా ఒకే చెప్పేందుకు సిద్ధమవుతునట్లు తెలిసింది. మారుమూల మండల కేంద్రాలు, ఏజెన్సీ ప్రాంతంలోను రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలను చెల్లించేందుకు వ్యాపారులు ముందుకొస్తునట్లు తెలుస్తుంది.

జోరుగా మంతనాలు

లిక్కర్ వ్యాపారాన్ని తమగుప్పిట్లో పెట్టుకునేందుకు కొంత మంది బడావ్యాపారులు చక్రం తిప్పుతున్నారు.దుకాణాలను దక్కించుకునేందుకు ఎంతకైనా తెగిస్తున్నారు. సిండికేటుగా ఏర్పడుతున్న వ్యాపారులు అధికారుల అండ తో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ సారి కొత్తగా మద్యం దుకాణాల ను దక్కించుకున్న వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. జిల్లాలో జో రుగా మద్యం దుకాణాల బేరసారాలు సాగుతున్నాయి. రాజకీయ అండతో కొంత మంది లిక్కర్ వ్యాపారం పైచేయి సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు అధికారులు కూడా తమ కుటుంబ సభ్యుల పేరిటా లక్కీ డ్రా ద్వారా దుకాణాలను దక్కించుకున్నారు. దీంతో తెరవెనుక ఉండి అధికారులే చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తుంది. మద్యం దుకాణాల టెండర్లతో కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి. ఇదంతా తెలిసినా ఎక్సైజ్ శాఖ అధికారులు తమకేమి తెలియనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

అంకితభావంతో పనిచేసినప్పుడే గుర్తింపు లభిస్తుంది

● మండల విద్యాధికారి వెంకట్రావు


ఉపాధ్యాయుడు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

తలమడుగు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మండల విద్య అధికారి వెంకట్రావు అన్నారు. శనివారం మండలంలోని సుంకిడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన స్కూల్ అసిస్టెంట్ గడ్డం సంజీవరెడ్డి సన్మాన కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరావు మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. సంజీవరెడ్డి సొంత గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించే పదవి విరమణ పొందడం ఎంతో అదృష్టం అన్నారు. ఇందులో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉండాలని ఆయన కోరారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయవర్ధన్ రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస స్వామి, గజానంద్ వై.రాం రెడ్డి, సుకుమార్ పెట్టుకులే సుజాత, శ్రీనివాస్ రెడ్డి, నాందేవ్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు కృష్ణవేణి, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్డుకు మరమ్మతులు

లక్ష్మణచాంద, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం గ్రామం నుంచి మునిపెల్లి మీదుగా చామన్‌పెల్లి ఎక్స్‌రోడ్డు వరకు మరమ్మతులు చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్ శనివారం తెలిపారు. రూ.4లక్షల 80 వేల పీఆర్ (ఎఫ్‌డీఆర్) నిధులతో ఈ మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు సహకారంతో ఈ పనులు పూర్తి చేయగలుగుతున్నామని వివరించారు.

కిసాన్ కపాస్ యాప్‌పై అవగాహన

నర్సాపూర్(జి), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బూరుగుపల్లి(జి) (గొల్లమాడ క్లస్టర్) గ్రామంలోని పత్తి రైతులకు కిసాన్ కపాస్ మొబైల్ అప్లికేషన్‌పై మండల విస్తరణ అధికారి (ఏఈవో) చెంద్యాల గణేష్ అవగాహన కల్పించారు. ముఖ్యంగా పత్తి విక్రయానికి తప్పనిసరి అయిన ఈ యాప్‌లో ఫోన్‌నెంబర్లు అప్డేట్ చేసుకునే విధానాన్ని వివరించారు. మద్దతు ధర పొందడానికి, దళారుల ప్రమేయం లేకుండా పత్తిని అమ్ముకోవడానికి యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవడం ప్రాముఖ్యతను స్పష్టం చేశారు. స్లాట్ బుకింగ్ చేసుకుంటేనే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలకు పత్తిని తరలించే వీలుంటుందని తెలిపారు.

గిరిజన పాఠశాలలో సమస్యలు పరిష్కరించండి

నిర్మల్‌రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆశ్రమ గిరిజన పాఠశాలలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ కే.విజయ్ అన్నారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ... ఆశ్రమ పాఠశాలలో కరెంటుపోతే సోలార్ లాంప్ లేక విద్యార్థులు చిమ్మ చీకటిలో ఉండాల్సిన పరిస్థితి ఉంది. చలికాలం రావడంతో విద్యార్థులకు స్నానాలకు వేడి నీళ్లు అందలేక శారీరకంగా ఇబ్బంది పడుతున్నారు. రాత్రుళ్లు చలి తట్టుకునేందుకు బెడ్‌షీట్‌లు అందించాలి. మరుగుదొడ్లలో శుభ్రత లేదు. కనీసం బాలికల ఆశ్రమాల్లో కూడా మరుగుదొడ్లకు డోర్లు లేవు. కొన్ని ఆశ్రమ పాఠశాలలకు సరైన ప్రహరీ గోడలు కూడా లేవు. కాబట్టి ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించాలి. ఫిల్టర్ నీళ్ల కోసం ఏర్పాటు చేసిన ఫిల్టర్ ప్లాంట్లు చెడిపోవడంతో ప్రైవేట్ వాళ్ల నుండి తెప్పించి పిల్లలకు తాగించే పరిస్థితి ఉంది. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కొమురం సంతోష్, సత్యనారాయణ, నైతం రాజు పాల్గొన్నారు.

అడెల్లి పోచమ్మ పునఃప్రతిష్ఠకు రండి

నిర్మల్‌రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన అడెల్లి పోచమ్మ అమ్మవారి పునఃప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాలని పలువురికి ఆహ్వానం అందించారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు హైదరాబాద్‌లో మంత్రి ఆఫీస్‌లో మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితో పాటు అడెల్లి ఆలయ కమిటీ చైర్మన్ సింగం భోజాగౌడ్, సారంగాపూర్ మాజీ జడ్పీటీసీ సభ్యులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు వేద పండితుల ఆధ్వర్యంలో అడెల్లి మహాపోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ జరుగుతుందని ఆల య కమిటీ ఛైర్మన్ సభ్యులు, మండల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సారంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఉట్ల రాజేశ్వర్, సాయికృష్ణ గౌడ్, భూమేష్, తదితరులున్నారు.

ఈజీఎస్ ఆధ్వర్యంలో గ్రామసభలు

ముథోల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించాల, ఎడ్‌బిడ్ గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో శనివారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. గత మూడు రోజుల నుండి సామాజిక తనిఖీ బృందంచే కూలీల దగ్గర సమాచారం సేకరించారు. 2024-2025లో జరిగిన పనుల వివరాలను సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో గ్రామసభ నిర్వహించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శివ కుమార్, ఏపీవో శిరీషారెడ్డి, డీఆర్పీలు సునీల్, శ్రీకాంత్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీలత, ఫీల్డ్ అసిస్టెంట్లు మోడపు రమేష్, సాయి, కార్యదర్శులు, కూలీలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

'ఓటు బ్యాంకు రాజకీయాలు సరికాదు'

భైంసా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం దేశ ఔన్నత్యాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తే గుణపాఠం నేర్పుతామని బీజేపీ నాయకులు అన్నారు. భైంసా పట్టణ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు రావుల రాము, గాలి రాజు, మిర్జాపూర్ పీఏసీఎస్ డైరెక్టర్ వడ్నపు శ్రీనివాస్‌లు మాట్లాడుతూ... జూబ్లీ హిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశాడని ఆరోపించారు. శనివారం పార్టీ ఆధ్వర్యంలో భైంసాలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థాయిని మరిచి మాట్లాడారని


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విమర్శించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సైనికుల త్యాగాలను అపహాస్యం చేసేలా, దేశ ప్రతిష్టతను దిగజార్చేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గౌరవప్రదమైన స్థానంలో ముఖ్యమంత్రి దిగజారుడు మాటాలు మాట్లాడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్ మెడలు వంచేలా చర్యలు చేపట్టిందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు.

సీఎం వ్యాఖ్యలపై నిరసన

నిర్మల్ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారత దేశ గౌరవాన్ని అవమానపరిచేలా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ పాకిస్తాన్ భారత్‌పై దాడి చేసినా భారత్ ప్రతిస్పందించలేదు అనే వ్యాఖ్యలు... భారత దేశ గౌరవాన్ని అప్రతిష్ట పాలు చేసే విధంగా, మన సైనికుల త్యాగాన్ని అపహాస్యం చేసేవిధంగా ఉన్నాయని, దీనికి నిరసనగా ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చినట్లు కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్. సాయి, సీనియర్ నాయకులు మేడిసెమ్మె రాజు, ఆడెపు సుధాకర్, సాధం అరవింద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొండాజి శ్రావణ్, జి. లింగం, ఉపాధ్యక్షులు వి. రాజు, కార్యదర్శులు నాగేందర్ పాండే, కందుల రవి, కౌన్సిలర్ నరేందర్, నరేంద్ర, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ రూరల్ :తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చినట్లు కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్. సాయి, సీనియర్ నాయకులు మేడిసెమ్మె రాజు, ఆడెపు సుధాకర్, సాధం అరవింద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొండాజి శ్రావణ్, జి. లింగం, ఉపాధ్యక్షులు వి. రాజు, కార్యదర్శులు నాగేందర్ పాండే, కందుల రవి, కౌన్సిలర్ నరేందర్, నరేంద్ర, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

మామడ : రాష్ట్ర ముఖ్యమంత్రి తన గౌరవాన్ని కాపాడుకోవాలని మామడ మండల బీజేపీ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కే. లక్ష్మీ అన్నారు. శనివారం డిప్యూటీ తహసీల్దార్ ఎస్. సంతోష్‌కు బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి దేశ గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు చేశారని, వెంటనే బేషరతులుగా క్షమాపణ చెప్పాలని ఆందోళన చేపట్టారు. సీఎం పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం రాష్ట్ర, దేశ ప్రజలకు తలవంచే విషయమని మండిపడ్డారు. వెంటనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు పందిరి సురేందర్, నాయకులు ఏలేటి నరేందర్ రెడ్డి, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భీంపూర్‌లో సోయా కొనుగోలు

భీంపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన భీంపూర్‌లో రేపటి నుంచి సోయా కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధర రూపాయలు 5328 క్వింటాల్‌తో సోయాబీన్ కొనుగోళ్ళ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ఆయుర్వేద ఆసుపత్రిని సందర్శించిన కళాశాల విద్యార్థులు


భైంసాలోని వన క్షేత్రంలో గల చెట్లను పరిశీలిస్తున్న విద్యార్థులు

తానూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం భైంసాలోని ఆరాధన ఆయుర్వేద చికిత్సాలయాన్ని సందర్శించినట్లు ప్రిన్సిపాల్ ఫణి రాజశేఖర్ తెలిపారు. ఎ.ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యులు డా. వేదాంత పాటిల్, డా. జూలీ, డా. సాయికుమార్ తదితరులు అవగాహన కల్పించారు. ప్రకృతిలో దొరికే చెట్ల ద్వారా రోగాలను ఎలా తగ్గిస్తారో విద్యార్థులకు వివరించారు. అలాగే భైంసాలో వన క్షేత్రంలో గల అనేక రకాల చెట్లు వాటి శాస్త్రీయ నామాలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వృక్ష శాస్త్ర ఆధ్యాపకులు లక్ష్మణ్, విజయ్, అనిత, సాయినాథ్, ఇతర ఆధ్యాపకులు విద్యార్థులు కలిసి పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలకు పాల్పడుతున్న వారిని శిక్షించాలి

ఖానాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హత్యా రాజకీయాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. శనివారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవన ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా పాతర్లపాడ్ గ్రామంలో సీపీఎం రాష్ట్ర నేత సామినేని రామారావును హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు నాగెల్లి నర్సయ్య, డాకూర్ తిరుపతి, సంచుల నారాయణ, తదితరులున్నారు.

బాధితులకు పరామర్శ

లక్ష్మణచాంద, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు మండలంలోని పలు బాధిత కుటుంబాలను శనివారం పరామర్శించారు. ధర్మారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అయిండ్ల శ్రీధర్ రెడ్డి తల్లి అయిండ్ల నర్సవ్వ, మునిపెల్లి గ్రామానికి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు నల్ల సంజీవ్ రెడ్డి, పొట్టపెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కోమటి రమేష్ భార్య సుశీల ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు

లక్ష్మణచాంద, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్యతరగతి ప్రజలకు న్యాయం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు అన్నారు. మండలంలోని పీచర గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బుర్రి భూమన్న బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఆయన సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి పేద కుటుంబాని కి పార్టీ పథకాలను చేరవేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మీ పథకం కింద 200ల యూ నిట్ల ఉచిత విద్యుత్ ఇస్తుందని, ప్రతి గ్రామంలో ఇళ్లు లేని పేదలకు ఉచితంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు ఇచ్చి పేదవాడి పక్షాన నిలుస్తుందన్నారు. వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలకు పెన్షన్ పెంపు, రైతులకు 2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేసి రైతు పక్షపాతి ప్రభుత్వమని నిరూపించుకుందన్నారు. ధనికులే కాదు పేదవారు కూడా ఆత్మగౌరవంతో సన్న బియ్యం తినాలని ఉచిత సన్న బియ్యం పథకం ప్రవేశపెట్టి పేదల కళ్లల్లో ఆనందం కోరుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం అమలు చేస్తున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాలు చూసి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నానని బుర్రి భూమన్న తెలిపారు. భూమన్నతో పాటు మరో 50 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీమ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కోండ్రు నరేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అబ్బడి ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రాల లింగారెడ్డి, ఆత్మ డైరెక్టర్ కిరణ్ ఠాగూర్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ గుట్ట వద్ద ప్రత్యేకపూజలు


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

లోకేశ్వరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాగాపూర్ శివారులో గల రాజ్యలక్ష్మి సహిత లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా లక్ష్మీనారాయణ స్వామి మూలవిరాట్‌కి పంచామృతాలతో అభిషేకపూజ నిర్వహించారు. అలాగే సహస్ర తులసీదళాలతో స్వామివారిని పూజించారు. నిండు ఫలాలను నివేదన గావిం చి, ఆలయ అర్చకుడు నరసింహస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మాట్లాడు తూ... తొలిఏకాదశి రోజు శ్రీ మహావిష్ణువు గాఢ నిద్రలోకి వెళ్లాడని, నాలుగునెలల తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశిన మేల్కొన్నారని, కార్తీక శుద్ధ ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించిన, స్వామివారి ఎదుట 33 పిండి దీపాలు వెలిగించి దీప దానం చేసినా ఎంతో పుణ్యఫలం కలుగుతుందని, సిరిసంపదలు సిద్ధిస్తాయన్నారు. భక్తులు వచ్చి స్వామివారి ఎదుట దీపాలు వెలిగించడం, స్వామిని పూజించి తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు.

గుంతలో పడి చిన్నారి మృతి


చిన్నారిపుష్ప (ఫైల్)

పెంబి,నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా, పెంబి మండలం, వేణునగర్ గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆత్రం రేణుక, రాముల దంపతుల ఐదేళ్ల కూతురు పుష్ప ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం తవ్విన పిల్లర్ల గుంతలో పడి మరణించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పుష్ప సాయంత్రం దాదాపు మూడున్నర గంటల ప్రాంతంలో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు నీటితో నిండిన పిల్లర్ల గుంతలో పడిపోయింది. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో చిన్నారి మృతి చెందిందని అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం దాదాపు 3 గంటల 55 నిమిషాలకు తమ దృష్టికి వచ్చిందని గ్రామ కార్యదర్శి అనిల్ కుమార్ తెలిపారు. హుటాహుటిన అంబులెన్స్‌కు ఫోన్ చేసి, చిన్నారిని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం దక్కలేదు. తమ చిన్నారి విగత జీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఈసంఘటనకు అంగన్ వాడీ టీచర్ నిర్లక్ష్యమే కారణమని గ్రామస్థులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. చిన్నారి అంగన్‌వాడీ కేంద్రంలో ఉండాల్సిన సమయంలో అంగన్‌వాడీ టీచర్ సరిగ్గా పట్టించుకోలేదని విమర్శలు. వెంటనే ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ విషయంపై ఇన్‌చార్జి సీడీపీవో శ్రీలత స్పందిస్తూ, చిన్నారి మృతి చెందిన విషయం తెలిసినా, ఎన్ని గంటలకు జరిగిం దనేది ఇంకా స్పష్టంగా తెలియలేద న్నారు. అంగన్‌వాడీ టీచర్‌ను అడుగగా నాలుగు గంటలకే ఇంటికి పంపించడం జరిగిందని, ఇది ఎలా జరిగింతో తెలియదు కానీ నాలుగు గంటలకు పడిందని తటస్థలంగా మాట్లాడిందని ఆమె తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని, దర్యాప్తు పూర్తయిన తర్వాత అంగన్‌వాడీ టీఈచర్‌పై తప్పకుండా చర్యలు తీసుకుంటా మని శ్రీలత వెల్లడించారు.

మట్టిలో మాణిక్యం

▸ చదువులో సుస్తీ.. క్రికెట్‌లో మస్తీ ▸ ప్రోత్సాహం కోసం ఎదురు చూపు


మరప విజయ్

ఉట్నూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచి ఆటల పై మక్కువ పెంచుకున్న ఆదివాసీ గిరిజన బాలుడు మరప విజయ్ చదువు పట్ల అంతగా ఆసక్తి ప్రదర్శించక పోవడంతో తల్లిదండ్రులు సైతం బాలుడి ఇష్టం వైపే మొగ్గు చూయించారు. ఉమ్మడి జిల్లాలోని అల్లంపల్లి గ్రామంలో ఉన్న జియర్ గురుకులంలో ఎనిమిదవ తరగతి వరకు చదువుకుంటు చదువు మధ్యలో నిలిపి వేసి తనకు ఇష్టం ఉన్న క్రికెట్ పైనే దృష్టి సారించిన ఆదివాసీ గిరిజన విద్యార్థి విజయ్ హైదరాబాద్‌లోని ఎస్ఎస్‌సీ క్రికెట్ అకామిలో శిక్షణ పొందుతు 70కి పైగా మ్యాచ్‌లు ఆడి మరో 200 క్రికెట్ మ్యాచ్‌లు ఆడాలని భావిస్తున్నాడు. రోజుకు 10 గంటల పాటు క్రికెట్ ప్రాక్టీస్ చేస్తూ జాతీయ జట్టులో చోటు సంపాదించుకోవాలని ఉబలాట పడుతున్నాడు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని సాలెవాడా(బి) గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం మరప విజయ, బాజీరావు దంపతుల కుమారుడు విజయ్. వీరికి ఇద్దరు కుమారులు ఉండగా పెద్దవాడు చదువు పట్ల అంతగా ఆసక్తి చూపించ లేదని, ఆయనకు ఉన్నక్రికెట్ మోజుతో క్రికెట్ ఆటలో పట్టు సాధించడాని తండ్రి బాధిరావు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎస్ఎస్‌సీ క్రికెట్ అకాడమిలో చేర్పించడంతో అక్కడి డైరెక్టర్ లవకుమార్ పర్యవేక్షణలో క్రికెట్లో రాణిస్తున్నాడన్నారు. వివిధ రాష్ట్రాలలో జరిగే అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్లలో పాల్గొనడానికి కావాల్సిన శిక్షణ పొందడంతో పాటు మరిన్ని మ్యాచ్‌లు ఆడే విధంగా తమ వద్ద ఆర్థికంగా లేక పోవడంతో తమ కుమారుడు నిరాశకు గురి అవుతున్నాడని అన్నారు.తమ కుమారుడికి మంచి శిక్షణ పొందడానికి ఐటీడీఏ ద్వారా గిరిజనసంక్షేమశాఖ అధికారులు తోడ్పాటు అందించాలని కోరుతున్నారు. ఇప్పటికే ఎంపీనగేష్, ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ను కలిసి తమకుమారుడికి క్రికెట్‌లో మంచి అవకాశాలు వచ్చేల శిక్షణ ఇప్పించడానికి కావాల్సిన ఆర్థిక సహయాం ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించాలని కోరుతున్నారు.ఏది ఏమైనా ఆదివాసీ గిరిజన విద్యార్థికి ప్రభుత్వం అండ కల్పించి రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయి క్రికెట్ క్రీడాకారునిగా ఎదిగేలా ప్రోత్సహించాలని గిరిజనులు కోరుతున్నారు.



ధాన్యం ఆరబోతకు స్థలం కొరత

▸ స్థలం లేక రోడ్లపైనే పంట ఆరబోత ▸ వాహనదారులకు తప్పని తిప్పలు

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌రూరల్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలో గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు పంటను ఆర బెట్టడానికి సరైన స్థలాలు లేక రోడ్లపైనే తమ పంటలను ఆరబెడుతున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు తమ పంటలను ఆర బెట్టడానికి సరైన స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. సరైన స్థలం లేకపోవడంతో ఇండ్లలోని పంటను సంచులలో వేసి ఉంచడంతో పంట తేమతో ఫంగస్ రావడం, రంగు మారడ వంటి కారణాలతో పంటను అమ్ముకోవడానికి రైతులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నారు. అలాగే పంటకు సరైన ధర రాక రైతులు పంటలను దళారులకు అప్పగించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పంట పొలాలలో ఆరబెట్టడానికి సరైన స్థలం లేదని అలాగే, ఆకస్మాత్తుగా వర్షాలు పడడం వల్ల అక్కడి నడి పంటను గ్రామాలకు తరలించడం కూడా ఇబ్బందవుతుందనే, కారణాలతో ప్రజలు తమ ఇళ్ల ముందరే రోడ్లపైన తమ పంటలను ఆరబెట్టుకుంటున్నారు. దీంతో ఆ రోడ్డు వెంబడి నడిచే వాహనాలకు ఇబ్బందులు ఏర్పాడుతున్నాయి. ఉపాధి హామీ కింద గతంలో కల్లాలను వ్యవసాయ భూములలో ఏర్పాటుచేసిన అవీ చాలా తక్కువ మొత్తంలోనే రైతులకు అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వాలే గ్రూపులు సంఘాల పేరుపై ప్రభుత్వ స్థలాలలో కల్లాల నిర్మాణం చేపడితే ఊరిలోని రైతులకు తమ పంటను ఆరబెట్టు కోవడానికి అనువుగా ఉంటుందని గ్రామీణ ప్రజలు భావిస్తున్నా రు. ఉపాధి హామీ పథకంలో భాగంగా నైనా రైతులకు తమపంటను ఆరబోసు కోవడానికి ప్రభుత్వాలు కల్లాలను ఏర్పాటు చేస్తే తమకెంతో మేలు చేసనిట్టు అవుతుం దని గ్రామీణ ప్రజలు కోరుకుంటున్నారు.

ఇంటి ముందే పంటలు ఆరబోస్తున్న..



మా గ్రామంలో పంటను ఆరబెట్టు కోవడానికి సరైన స్థలం లేకపోవ డంతో ఇంటి ముందరే తాడిపత్రిలు పరిసి వాటిపై పంటలను ఆరబెడుతున్నాం. కానీ నేల మొత్తం తడిగా ఉండడంతో కింద నుంచి తేమ రావ డంతో పంట రంగు మారి సరైన ధర రాక నష్టపో తున్నాం. ప్రభుత్వం రైతు కష్టాలను అర్థం చేసుకొని గ్రామా ల్లో పంటలను ఆరబెట్టుకోవడానికి కల్లాలు నిర్మించి అందిస్తే బాగుంటుంది.

- చంద్రశేఖర్, రైతు, అంకోలి

గ్రామాల స్థితిగతులపై ఆల్ ఇండియా అధికారుల అధ్యయనం


ట్రైయిని అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

నేరడిగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల స్థితి గతులపై ఆల్ ఇండియా ట్రైయిని అధికారుల అధ్యయనం ఆల్ ఇండియా అధికారుల టీమ్ మండలంలోని కుమారి గ్రామంలో నాలుగు రోజులు ఉండి గ్రామస్థాయిలో ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉంటాయి, ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఏలా చెరుతున్నాయి. దీని వల్ల వారి జీనవ స్థితిగతులు ఎంత వరకు బాగు పడుతున్నాయి అనే వాటిని అన్లైన్ చేస్తారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఎలా పని చేస్తున్నాయి. ప్రజలు ఎంత వరకు లాభం పోకూరుతుంది అనేది చూస్తారు. ప్రజలకు ఇంకా గ్రామ అభివృద్ధికి కావలసిన పథకాలు ఏమైనా వారికి అవసరం ఉండి కలెక్టరు కు నివేదిస్తారు. మొదటి రోజు గ్రామానికి చేరుకుని బసచేశారు. రెండవ రోజు గామముతో తిరిగి పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం. పంచాయతీ కార్యాలయము సందర్శించి గ్రామంలో నెలకొన్న సమస్యలు తెలుసుకుని అవసరమున్నా పనులను జిల్లా కలెక్టర్‌కు నివేదించునున్నామని వారు తెలిపారు. ఇందులో ఐఏఎస్ ఐపీఎస్, ఐఎఫ్ఎస్ఐ, ఐఎస్ఎస్, ఐఆర్ఎస్ అధికారులతో పాటు ఎంపీడీవో మండల స్థాయి అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీవీటీజీ గిరిజనుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం


చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పీవీటీజీ ఐక్యవేదిక ప్రతినిధులు

ఉట్నూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి)ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో పీవీటీజీ గిరిజనుల ఇండ్ల నిర్మాణాల బకాయి బిల్లులు రూ.16. 43కోట్లు ప్రభుత్వం విడుదల చేయడంతో ఆదివాసీ పీవీటీజీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఖానాపూర్ ఎమ్మెల్యేల చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్ వద్ద ఆదివాసీ పీవీటీజీల ఐక్యవేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కుడిమెత తిరుపతి, మాట్లాడతూ 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి ఆదివాసీ పీవీటీజీ గిరిజనులకు సీసీడీపీ నిధుల ద్వారా మంజూరు చేసిన ఇండ్ల బిల్లులు విడుదల కాక జాప్యం జరుగుతుండడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆధ్వర్యంలో మంత్రులు సీతక్క, లక్ష్మణరావు నేతృత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల దృష్టికి శుక్రవారం తీసుకు వెళ్లగా వెంటనే ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో బకాయి ఉన్న రూ.16కోట్ల 43లక్షల 87వేలు మంజూరు చేసింది. అదే విధంగా మన్ననూర్ ఐటీడీఏ ప్రాంతానికి రూ.11కోట్లు విడుదల చేయడంతో ముఖ్యమంత్రికి డిప్యూటీ సీఎం, మంత్రులు సీతక్క, లక్ష్మణరావులకు, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పీవీడీజీ తెగల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉండి తమ బకాయి బిల్లులు విడుదల చేసినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్రం ముకుందరావు, మరుసుకోల బాపురావు, మడావి రాజేశ్వర్, మడావి ఆమాణిక్‌రావు, మేస్రం జయరాజ్, చాకటి మారుతిలు ఉన్నారు.

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నార్నూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో సోయా కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తమ్, పాక్స్ చైర్మన్ సురేష్ ఆడె, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.గజానంద్ నాయక్ శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం క్వింటాల్ సోయాకు రూ.5,328 మద్దతు ధర ప్రకటించిందని, కొనుగోలు కేంద్రంలోనే రైతులు సోయాను విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, మద్దతు ధరకు తమ సోయా పంటను అమ్ముకోవాలని ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసమే ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సోయం మారుతి, సీఈఓ గణేష్ ఆడె, రైతులు బాల, రామరావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవరావు లోకండే, బీజేపీ మండల అధ్యక్షులు బిక్కు రాథోడ్ షేక్ దస్తగిరి, కాంతరావు దూర్వే, సయ్యద్ ఖాసిం, దళిత రత్న అవర్డ్ గ్రహీత కొర్రేలా మహేందర్, గుంజ చిన్న పాల్గొన్నారు.

సోయాబీన్ పంట కొనుగోళ్లకు మూడుననే ముహుర్తం

బోథ్, నవంబర్1 (ఆంధ్రజ్యోతి):గత 20 రోజులుగా మండలంలోని రైతులు సోయా మొక్కజొన్న పంటను మార్కెట్లో విలువ ఉంచి పంట కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంతో రైతులు ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. దీంతో ప్రభుత్వం కొనుగోళ్ల కోసం రంగం సిద్ధం చేసింది.

ఈ నెల మూడున ముహుర్తం

సోయాబీన్ పంట ఆలస్యం పై రైతులు ఆందోళన కార్యక్రమాలనుచేపట్టారు. సోనాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి ధర్నా కార్యక్రమం చేయడంతో 13 మంది పైన కేసులు నమోదు అయ్యాయి. అయితే ఈ కేసుల వ్యవహారం రాజకీయ కుంపటి రాజుకుంది.

మూడునే కొనుగోలు ప్రారంభిస్తాం: ఎమ్మెల్యే

సోయాబీన్ పంట కొనుగోలను ఈ నెల మూడో తేదీన చేపడతామని స్థానిక శాసనసభ్యులు అనిల్‌జాదవ్ నిర్ణయించారు. దీంతో అధికారులు కొనుగోలు ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించారు. పంట కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ పరంగా నిర్ణయానికి వస్తుండగా పంట కొనుగోలు మయంలో తేమ శాతం విషయంలో కొర్రీలు పెట్టే అస్కారం ఉందని రైతులు అంటున్నారు.

కొనుగోలు చేస్తాం న్యాయం జరుగుతుంది : ఆత్మచైర్మన్

ఈ యేడాది రైతులు పండించిన సోయాబీన్ మొక్కజొన్నతో పాటు అన్ని రకాల పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఈ విషయమై ఇప్పటికే రాష్ట్ర మంత్రులతో పాటు జిల్లా ఇన్‌చార్జీ మంత్రికి విన్నవించడం జరిగిందని బోథ్ బ్లాక్ ఆత్మచైర్మన్ జి.రాజుయాదవ్ పేర్కొన్నారు. రైతులు పంటను ఆరబెట్టి నాణ్యమైన ధరకు అమ్ముకోవాలని సూచించారు. మంచి రకం పంటలు తీసుకువస్తే దరలో తేడా ఉండకుండా అధికారులు కొనుగోలు చేస్తారన్నారు.

రైతులను మోసగించిన రాష్ట్ర ప్రభుత్వం


సోనాలలో మాట్లాడుతున్న ఎస్‌సీఆర్ మాజీ సభ్యుడు

బోథ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తుందని అంతేకాక అధిక వర్షాల వల్ల రైతులు నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందని దక్షిణ మధ్య రైల్వే బోర్డు మాజీ సభ్యుడు జీవి రమణ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోరి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం అందుకు సంబంధించిన ప్రీమియం చెల్లించక పోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయే అస్కారం ఉందన్నారు. ప్రభుత్వం చెల్లించాల్సిన ఫసల్ బీమా డబ్బులు చెల్లించి ఉంటే రైతులు లాభపడే వారన్నారు. పండించిన పంటలకు ప్రైవేట్‌లో గిట్టుబాటు ధర లేదని వాపోయారు. వర్షాల వల్ల పంటలకు పెట్టిన పెట్టుబడులు చేతికిందే పరిస్థితిలో లేవని దీంతో రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు గతంలో ఎకరానికి పదివేల రూపాయల నష్ట పరిహారం ఇస్తామని ప్రకటించి ఇంత వరకు చెల్లించ లేదన్నారు. కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మాయమాటలతో మోసం చేసిన వ్యక్తుల అరెస్టు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో నమ్మించి... అమాయకులను మోసం చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో ఆయన పాల్గొని కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని ఓ లాడ్జ్‌లో ఉంటున్న పంజాబ్‌కు చెందిన సర్దార్ విక్రమిత్ సింగ్ గత నెల 21వ తేదీన రాత్రి భోజనం చేసేందుకు బయటకు వెళ్లాడు. ఇదే సమయంలో అక్కడికి ఆటోలో వచ్చిన రాథోడ్ యువరాజ్, జాదవ్ కిరణ్ ఆయన కు మాయ మాటలు చెప్పి హైవేపై మంచి భోజనం దొరుకుతుందని నమ్మించారు.పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొట్టించిన సమ యంలో ఫోన్ పే పాస్ వర్డ్ గమనించారు. అక్కడి నుంచి నేరడిగొండ సమీ పంలో బాధితుడికి మద్యం తాగించారు. ఆ తర్వాత బాధితుడి వద్ద ఉన్న నగదు రూ.50,000, ఫోన్ దొంగిలించి... ఎవరు లేని ప్రదేశంలో వదిలేసి వెళ్లిపోయారు. ఉదయం సదరు వ్యక్తి లేచి చూసేసరికి మోసపోయానని గ్రహించి ఖాతాను పరిశీలించగా... రూ. 46,000 ఇతర అకౌం ట్‌కి ట్రాన్స్‌ఫర్ చేసినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో బ?డ్ ఏరియాలో వాహనాల తనిఖీ సమయంలో నిందితులను అదుపు లోకి తీసుకున్నారు. సమావేశంలో టౌన్ ఇన్‌స్పెక్టర్ కె నాగరాజు, వన్టౌన్ సీఐ బి.సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

▸ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ కిరణ్ కుమార్


అవగాహన కల్పిస్తున్న వైద్యుడు కిరణ్

ఇచ్చోడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రోగాల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవాలని, వారానికి ఒక్కసారి మన ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. శనివారం ఇచ్చోడ మండలంలోని సాత్‌నంబర్ గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులతో బాధపడే వారికి చికిత్స అందించి మందులను పంపిణీ చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భాగంగా వర్షం నీరు నిల్వ ఉండే కుండీలు, పాతటైర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. మన ఇంటి పరిసరాలతో పాటు మన చుట్టూ ఉన్న వాళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోలవాన్నారు. వర్షాలు కరుస్తున్నదున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆశ, ఏఎన్ఎమ్ సిబ్బంది గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ బ్రహ్మానందరెడ్డి, సిబ్బంది పవర్ రవీందర్, కైలాష్, సుభాష్, తులసి, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

బరంపూర్ కొండపై ఎంకన్నకు పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తలమడుగు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్ కొండపై స్వయంభుగా వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస శనివారాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం వేంకటస్వామి గోదాదేవికి అభిషేకం అర్చన నిర్వహించారు అలాగే ప్రతి శనివారం ఆదిలాబాద్ వాస్తవ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ముడుపు కేదారేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. వేంకటేశ్వర స్వామి భక్తుల సహకారంతో ఆలయం తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చెందుతుందన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు ఆలయంలో అన్నదానం నిర్వహించే భక్తులు మూడు నెలల ముందుగా తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగిపోయింది అదేవిధంగా శ్రీవారి సేవ కోసం మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక సేవ కార్యక్రమాలు చేపట్టారు.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఇందులో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

గుండె పోటుతో అధికారి మృతి


మెస్రం జాలింషావ్(ఫైల్)

నార్నూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంజల గ్రామా నికి చెందిన మెస్రం జాలింషావ్ గుండె పోటు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉద్యోగ రీత్యా భూపాల్ పల్లి జిల్లా మహాదేవాపూర్ మండలం పంకెని సెక్షన్‌లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తు న్నారు. రాత్రి సమయంలో ఇంటికి దగ్గర పడుకున్న నిద్రలోనే గుండె పోటు వచ్చి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతినికి భార్య, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రాజెక్టులో దూకి ఉపాధ్యాయుడి ఆత్మహత్య


కుంట్ల రాజశేఖర (ఫైల్)

కడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కడెం ప్రాజెక్టులోకి దూకి ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా జూలపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యా యుడు కుంట్ల రాజశేఖర్ రెడ్డి శనివారం వివాహ విందుకు వచ్చి ప్రాజెక్టులో దూకాడు. గమనించిన ఇరిగేషన్ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న కడెం ఎస్సై సాయి కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణాలు తెలి యాల్సి ఉంది.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి


పడిగెల పోశన్న (ఫైల్)

లక్ష్మణచాంద, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన పడిగెల పోశన్న(55) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు వాగులో మునిగి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మత్స్యకారుడు పోశన్న వద్యాల్ గ్రామ సమీపంలో గల వాగు వద్ద చేపలు పట్టుటకు వెళ్లి ప్రమాదవశాత్తు చేపల వల అతని కాలుకు చుట్టుకొని నీటిలో మునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. మృతుడి భార్య పడిగెల నర్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల బెడదతో జనాలు పరేషాన్


బహిరంగంగా తిరుగుతున్న కుక్కలు

నార్నూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రోజు రోజు కుక్కలు బెడద ఎక్కువగా అవుతోంది. చాలా కుక్కలకు వ్యాధితో పురుగులు పడి బహిరంగంగా తిరుగుతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అవి ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని ఆందోళనకు గురవుతన్నారు. అధికారులు స్పం దించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టేకు చెట్లు నరికిన నిందితుడి రిమాండ్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్‌డీవో శివకుమార్

ఖానాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కడెం మండలం ఉడుంపూర్ రేంజ్ పరిధిలో గత 15 రోజుల క్రితం రాంపూర్ అడవుల్లో చెట్లు నరికిన నిందితుడు వెంబడి రాజశేఖర్‌ను అరెస్టు చేసి శనివారం రిమాండ్ చేస్తున్నట్లు ఖానాపూర్ ఎఫ్‌డీవో శివ కుమార్ తెలిపారు. శనివారం ఖానాపూర్‌లోని ఎఫ్‌డీవో కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సదరు నిందితుడితో పాటు జన్నారంకు చెందిన సాయికృష్ణ, కళ్యాణ్ అనే ఇద్దరు వ్యక్తులు కలిసి రాంపూర్ అడవుల్లో రూ.8లక్షలు విలువ చేసే పదిహేను టేకు చెట్లను నరికేసినట్లు పేర్కొన్నారు. ఈ నిందితులు ముగ్గురిలో రాజశేఖర్ మాత్రమే పట్టుబడ్డాడని మిగతా ఇద్దరు పరారీ లో ఉన్నట్లు ఆయన తెలిపారు. అడవుల నరికివేత, వన్యప్రాణుల వేటకు ఎవరు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఖానాపూర్, ఉడుంపూర్ ఎఫ్ఆర్‌వోలు కిరణ్ కుమార్, అనిత, ఖానాపూర్ ఎఫ్ఎస్‌వో రవీందర్‌లు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

కుభీర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాగేష్ ఇండస్ట్రీస్ నందు సీసీఐ ఆధ్వర్యంతో 3వ తేదీ సోమవారం నుంచి పత్తి కొనుగోలు ప్రారంభించనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రాజేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులుఈ విషయమై ఒక్కరోజు ముందుగానే స్లాట్ నెంబర్ బుక్ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా కపాస్ కిసాన్ ఆప్‌లో నమోదు చేసుకున్న మొబైల్‌తో నెంబర్‌తో పాటు, పట్టా పాసు బుక్కు జిరాక్సు ప్రతులను తప్పకుండా తమ వెంట తీసుకురావాలని పేర్కొన్నారు.

సరైన విధానంలో రక్త పరీక్షలు నిర్వహించాలి

» జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్

నిర్మల్ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లింఫాటిక్ ఫైలేరియాను నివారించడానికి ట్రాన్స్‌మిషన్ అసెస్మెంట్ సర్వేలో భాగంగా రక్త నమూనాల సేకరణ, పరీక్షలపై జిల్లాలోని ఆరోగ్య సహాయకులకు, ల్యాబ్ టెక్నీషియన్లకు, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో లింఫాటిక్ ఫైలేరియా గుర్తించబడిన గ్రామాల్లో రాత్రిపూట రక్త నమూనాలను సేకరించి పరీక్షలను నిర్వహించామని తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్స్ శిక్షణ కార్యక్రమాన్ని సక్రమంగా వినియోగించుకుని, సరైన విధానంలో రక్త పరీక్షలను నిర్వహించాలని కోరారు. రక్త పరీక్షల అనంతరం ఫైలేరియా వ్యాప్తి తగ్గిందా? లేదా? తెలుస్తుందని తెలిపారు. కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ ప్రత్యూష, ఆరోగ్య పర్యవేక్షకులు భోజారెడ్డి, ఆరోగ్య సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలు సరికావు

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్



నిర్మల్ కైన్‌గేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశ గౌరవాన్ని అవమానపరిచేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని, తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాకిస్తాన్ భారత్‌పై దాడి చేసినా.. భారత్ ప్రతిస్పందించలేదు అనే వ్యాఖ్యలు.. దేశ గౌరవాన్ని దెబ్బతీసే దుష్ప్రయత్నమే కాకుండా, మన సైనికుల త్యాగాన్ని అపహాస్యం చేయడమేనని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం త్యాగం చేసిన వీర జవాన్ల మనోభావాలను దెబ్బతీసే విధంగా, బాధ్యత గల స్థాయిలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రాజకీయ వేదిక పైనుంచి అవమానకర వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు ధైర్యంగా ముందడుగు వేసింది. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా భారత సైన్యం పాకిస్తాన్ భూ భాగంలో ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసి ప్రపంచానికి భారత శౌర్యాన్ని చూపించిందన్నారు. సైనికుల ఆత్మ గౌరవాన్ని అవమానించే విధంగా మాట్లాడిన రేవంత్‌రెడ్డికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి వెంటనే దేశ ప్రజలతో పాటు సైనికులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



● ఎక్బాల్‌పూర్ శివారులో అడవులను ఆనుకొని రెవెన్యూ భూములలో ఇసుక డంపులు(ఫైల్)

ఇసుకాసురులు!

- » ఖానాపూర్, కడెం మండలాలలో జోరుగా ఇసుక అక్రమ రవాణా
- » ఒకరిపై మరొకరు నెపం నెట్టుతూ.. దాటవేస్తున్న ప్రభుత్వ శాఖలు
- » తూతూ మంత్రపు చర్యలతో అక్రమార్కులకు అధికారుల అండ
- » వాగులు, ఒర్రెలన్నీ తోడేస్తూ.. ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న కేటుగాళ్లు
- » అడవులను ఆనుకొని ఇసుక డంపులు
- » మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్న అక్రమ వ్యాపారం

ఎంతో విలువైన.. ప్రకృతి సంపదకు పెట్టింది పేరైన ఖానాపూర్, కడెం ప్రాంతంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా ఇక్కడి ప్రకృతి వనరులను తరలిస్తున్న కేటుగాళ్లను అడ్డుకునే వారెవరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దట్టమైన అడవులు ఉన్న ప్రాంతంగా పేరుగాంచిన ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్, ఉడుంపూర్ ప్రాంతాలు కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ఉన్నాయి. ఇక్కడి నదుల్లో, వాగుల్లో, సెలయేర్లలో ఇబ్బడిముబ్బడిగా ఇసుక మేటలున్నాయి. గుట్ట ప్రాంతాల్లో రాళ్లు, నాణ్యమైన మొరం, విలువైన వృక్ష సంపద ఈ ప్రాంతం సొంతం. దీంతో ఇక్కడి విలువైన ప్రకృతి సంపదను అక్రమంగా కొల్లగొట్టి తమ సంపదను పెంచుకోవాలని కొంతమంది కేటుగాళ్లు ఎత్తులు వేశారు. ఈ సంపదను కొల్లగొట్టి కోట్ల రూపాయలకు పడగలెత్తడమే లక్ష్యంగా దందాలు సాగిస్తున్నారు.

ఖానాపూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వ్యవస్థలో ఉన్న లొసుగులను ఉపయోగించుకొని ఉన్నత చదువులు చదివిన అధికారులను సైతం బోల్తా కొట్టించి ప్రకృతి వనరులను దోచుకునేందుకు కొంతమంది కేటుగాళ్లు వేస్తున్న ఎత్తుగడలు ఎంతటి వారినైనా ఔరా అనిపిస్తున్నాయి. అక్రమ దందాను సక్రమంగా నిర్వహిస్తున్నట్లు ప్రపంచానికి కనిపించేలా అన్ని పత్రాలను సృష్టించుకుని ఖానాపూర్, కడెం ప్రాంతాల నుంచి ప్రకృతి వనరులను తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ దందా సాగించేందుకు కొంత మంది మాఫియాగా ఏర్పడి అధికారులను, ప్రజాప్రతినిధులను తమ చేతల్లో పెట్టుకుని లక్ష్యం దిశగా సాగుతున్నారు. ఇంత జరుగుతున్నా.. మాకెందుకులే? అనే విధంగా ఒకరిపై ఒకరు నెపం నెట్టుతూ అధికార యంత్రాంగం మామూలుగా తీసుకుంటూ ఈ దందాకు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

తూతూ మంత్రపు చర్యలు

ఖానాపూర్, కడెం ప్రాంతాల్లోని ఒర్రెలు, సెలయేర్లు, వాగులతో పాటు గోదావరి నది నుంచి ఇసుకను తోడేస్తున్న మాఫియాను అడ్డుకునేందుకు అధికారులు వెనకడుగు వేస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఇందుకు కారణంగా సంబంధిత శాఖల అధికారులకు జిల్లా స్థాయి, మండల స్థాయిలో ముడుపులు ముడుతున్నాయని చెబుతున్నారు. క్షేత్రస్థాయి స్థానికుల ఒత్తిడి మేరకు ఈ ఇసుక తవ్వకాలను అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపై గతంలో సైతం సదరు ఇసుక మాఫియా దాడులకు తెగబడుతున్నట్లు చెబుతు న్నారు. ఈ విషయాన్ని గతంలో ఖానాపూర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఓ అధికారి నేరుగా మీడియా ముఖంగా మాట్లాడుతూ... ఖానాపూర్ శివారులోని రెంకోని వాగులో జరుపుతున్న ఇసుక తవ్వకాలను అడ్డుకునేందుకు వెళ్లిన తమ ఆర్ఐ సహా ఇతర అధికారుల బృందంపై ఇసుక మాఫియా దాడికి ప్రయత్నించిందని, దీంతో అక్కడి నుంచి తమ అధికారులు పరుగులు తీశారని చెప్పడం గమనార్హం. ఇసుక తవ్వకాలు నిర్వహించే స్థలం వద్ద కొంతమంది మాఫియా అడ్డా వేసి.. అటుగా ఎవ్వరు వచ్చినా మట్టు పెడతామనేలా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. తవ్వకాలు జరిపే చోట్ల ఇలా ఉంటే ఇసుకను తరలించేందుకు ఈ మాఫియా మరింత రెచ్చిపోవడం విడ్డూరం. ఈ ప్రాంతంలోని వాగులలో, ఒర్రెలలో లభించే విలువైన ఇసుక వనరులను జేసీబీ, ఎక్స్‌కావేటర్లతో అడవులను ఆనుకుని ఉన్న రెవెన్యూ భూములలో నిల్వ చేస్తూ ఇటు రెవెన్యూ, అటు అటవీ శాఖ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. శివారు ప్రాంతాలలో ఇసుకను డంపులుగా పోసి లారీలలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఈ ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయకపోతే వీరి ఆగడాలు మరింత ఎక్కువై క్షేత్రస్థాయిలో సామాన్యులకు ఇసుక దొరకని పరిస్థితి నెలకొంటుందంటున్నారు.

ప్రకృతి వనరుల తరలింపును అడ్డుకునేదెవరు?

అటవీ ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తే చర్యలు

: కిరణ్ కుమార్, ఎఫ్ఆర్‌వో, ఖానాపూర్



ఖానాపూర్ ప్రాంతంలో అటవీ భూభాగంలో ఎటువంటి ఇసుక తవ్వకాలు జరగడం లేదు. అడవుల్లోంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు చేపడతాం. ఎప్పటికప్పుడు అడవుల్లో మా సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారు. అడవుల్లోంచి ఇసుక తీసినా.. అటవీ మార్గం గుండా వాహనాలు వెళ్లిన కఠిన చర్యలు చేపడతాం.

క్షేత్ర స్థాయిలో కృత్రిమ కొరత

జిల్లాలో సాగుతున్న ఇసుక అక్రమ దందాకు ఖానాపూర్, కడెం ఉమ్మడి మండలాలు ప్రధాన కేంద్రంగా నిలుస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఖానాపూర్ మండలంలోని ఎక్బాల్‌పూర్, తర్లపాడ్, పాత తర్లపాడ్, ఎల్లాపూర్, ఎర్వచింతల్, రాజురా, మస్కాపూర్, సుర్జాపూర్, బాదనకుర్తి ప్రాంతాలతో పాటు పెంబి మండలంలోని మందపెల్లి, పెంబి, కడెం మండలంలోని మద్దిపడగ, చిట్యాల, బెల్లాల్, లింగాపూర్ ప్రాంతాల్లోని గోదావరి నది, రెంకోని వాగు, పలికేరు వాగు, కడెం వాగుతో పాటు పంట చేలను ఆనుకొని ప్రవహించే ఒర్రెలు, వాగులలో లభించేలా విలువైన ఇసుకను జేసీబీల సహాయంతో తోడేస్తున్నారు. గ్రామాల శివారులో డంపులు పోస్తున్నారు. కొంతమంది పలు రాజకీయ పార్టీలలో నాయకులుగా చెలామణి అయ్యే వ్యక్తులతో కలిసి ఈ దందాను సాగిస్తున్నారు. ఇలా క్షేత్రస్థాయిలో దొరికే ఇసుకను నిర్మల్, భైంసా, నిజామాబాద్ లాంటి ప్రాంతాలకు లారీలలో తరలిస్తూ క్షేత్రస్థాయిలో కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం వరకు రూ.వెయ్యిలకు ఒక ట్రిప్పు ఇసుక దొరికే పరిస్థితి నుంచి ప్రస్తుతం రూ.1800 నుంచి రూ.2వేల వరకు వెచ్చించే పరిస్థితికి తెచ్చారు. దీంతో సామాన్యులు అదనపు ధరను వెచ్చించాల్సిన పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో లభించే ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించకుండా అడ్డుకట్ట వేసి విలువైన ప్రకృతి సంపదను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

సోయా కొనుగోళ్లపై ఆందోళన వద్దు

● కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ కైన్‌గేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సోయా కొనుగోళ్లపై రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం తెలిపారు. సోయా పంటను ప్రభుత్వం నిర్ణయించిన తేమ శాతం ప్రకారం కొనుగోలు చేస్తామని, రైతులు ఆ ప్రమాణాలకు అనుగుణంగా పంటను మార్కెట్ యార్డ్‌కు తీసుకురావాలని సూచించారు. మండల స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు టోకెన్లు జారీ చేస్తున్నారని, ఆ టోకెన్ల ప్రకారం నిర్ణయించిన తేదీల్లోనే రైతులు తమ పంటను తీసుకురావాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా, పారదర్శకంగా జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని సోయా పంటను మొత్తం కొనుగోలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. పంట కొనుగోళ్లపై తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని రైతులు విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి పత్తి కొనుగోళ్లు

● భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి

భైంసా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ పరిధి లో సోమవారం నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్ల ప్రారంభమవుతాయని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పూర్యనాయక్ తెలిపారు. ఇందుకు సంబంధించి శనివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ విధానంలో పత్తి కొనుగోళ్ల నిర్వహించాయని వివరించారు. పట్టణ పరిధిలోని ఎస్ఎస్ కాటన్ ఇండస్ట్రీస్, కృషికాటన్ ఇండస్ట్రీస్, భగవతి కాటన్ ఇండస్ట్రీస్, రాశీ కాటన్ ఇండస్ట్రీస్ ప్యాక్టరీలో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సీసీఐ కేంద్రాలలో పత్తి దిగుబడులను విక్రయించుకునే రైతులు ఒక రోజు ముందుగానే కొనుగోలు కేంద్రాన్ని ఎంపిక చేసుకొని యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు.

ముథోల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ

ముథోల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని పోలీస్ స్టేషన్‌ను శనివారం భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో ఏ తరహా కేసులు ఎక్కువ నమోదవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా నమోదవుతున్న కేసుల గురించి కంపారిటివ్ స్టేట్మెంట్‌ను పరిశీలించి, అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న సీడీ ఫైళ్లను, పెండింగ్ ట్రాయల్‌లో ఉన్న సీడీ ఫైళ్లను, గ్రేవ్ కేసులలో ఉన్న సీడీ ఫైళ్లను, రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో పచ్చదనం, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అంతకుముందు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై బిట్ల పెర్సెస్, పోలీస్ సిబ్బంది, తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఖానాపూర్ ఎమ్మెల్యే

కడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, తహసీల్దార్ ప్రభాకర్, ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడిగెల భూమన్న, కాంగ్రెస్ నాయకులు సతీష్ రెడ్డి, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఖానాపూర్ : మండలంలో శనివారం కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌లు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖగోళవిజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను ప్రారంభించారు. అనంతరం పాఠశాలకు పీఎం శ్రీ పథకం కింద మంజూరైన క్రీడా సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగేలా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. పాఠశాలకు కావలసిన నిధులను మంజూరు చేస్తామన్నారు. జిల్లాలోనే ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు.

చెడుమార్గాల వైపు వెళ్లొద్దు...

● ఎమ్మెల్యే బొజ్జు పటేల్

విద్యార్థులు చెడు మార్గాల వైపు వెళ్లవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సూచించారు. ఇటీవల మస్కాపూర్‌లో జరిగిన విద్యార్థుల వికృత చేష్టలకు కారకులైన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. పట్టణంలోని ఏఎంసీ కార్యాలయం ప్రాంగణంలో ఖానాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ప్రారంభించారు. వేర్వేరు కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఈవో భోజన్న, ఏఎంసీ చైర్మన్ భూమన్న, వైస్ చైర్మన్ మాజీద్, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, సత్తెనపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఆమంద శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దయానంద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు చిన్నం సత్యం, రాజేందర్ పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

పెంబి : వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని నాగాపూర్ గ్రామం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం నాగాపూర్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు మంచి విద్యను అందించాలని, విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల శంకర్, కాంగ్రెస్ నాయకులు తులాల శంకర్, మేర నర్సయ్య, అశోక్ రావు, ఖాన్, జగన్ రావు, టికాజీ, తదితరులు ఉన్నారు.

సోయా టోకెన్ల కోసం రైతుల బారులు



తానూర్‌లో సోయా టోకెన్ల కోసం బారులు తీరిన రైతులు

తానూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వ్యవసాయ గోదాం వద్ద టోకెన్ల కోసం రైతులు బారులు తీరారు. మొదటిరోజు కావడంతో మండల వ్యాప్తంగా రైతులందరూ ఒకేసారి పెద్ద సంఖ్యలో వచ్చారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది మూడుకౌంటర్లలో టోకెన్లు జారీ చేస్తున్నారు. రైతులు ఒక్కొక్కరు రెండుమూడు పట్టా పాస్‌బుక్‌లు తీసుకురావడంతో సిబ్బంది ఆన్‌లైన్‌లో చెక్‌చేసి టోక్లను జారీచేయడంతో ఆలస్యం అవుతుంది. క్యూలైన్‌లలో రైతులు గంటల తరబడి నిలవడంతో ఒద్దరు రైతులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. పక్క ఉన్న రైతులు వారికి క్యూలైన్‌లోంచి పక్కకు తీసుకెళ్లారు. అస్వస్థతకు గురైన రైతు లు కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడంతో మళ్లీ మామూలు స్థితికి వచ్చారు. భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్ గోదాం టోకెన్ సెంటర్‌ను సందర్శించారు. రైతులు క్యూలైన్‌లో నిలపడకుండా వారి దగ్గర ఉన్న పట్టాపాసు బుక్‌లను ఒక దగ్గర జమ కట్టి, పీఏసీఎస్ సిబ్బందికి ఇవ్వడం వలన క్యూలైన్ తగ్గిపోయింది. సహకార సంఘం సిబ్బంది టోకెన్లు ఇవ్వడంతో రైతులు క్యూలైన్‌లో నిలబడకుండా టోకెన్లు తీసుకున్నారు. సోమవారం, మంగళవారం, గురువారం ఇంకా టోకెన్లు ఇస్తున్నారని సొసైటి సీఈవో భూమయ్య తెలిపారు. ప్రతి ఒక రైతుకు కొనుగోలు టోకెన్‌లు ఇస్తామన్నారు.

కుభీర్ : మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో సోయాటోకెన్ల కోసం శనివారం రైతులు బారులు తీరారు. శనివారం టోకెన్లు అందిస్తున్నారని తెలుసుకున్న మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల రైతులు శనివారం వేకువజామున 5గంటల నుంచి క్యూలైన్‌లో నిలుచొని బారులు తీరారు. ఉదయం 11 గంటల వరకు వందలాది రైతులు లైన్‌లో నిల్చోవడంతో తోపులాట జరిగింది. దీంతో ఇద్దరు మహిళ రైతులు ఇద్దరు రైతులకు తేలిక పాటి దెబ్బలు తగిలాయి. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై కృష్ణారెడ్డి అక్కడికి చేరుకొని తోపులాట జరగకుండా చూశారు. అనంతరం క్యూలైన్‌లో ఉన్న రైతుల దగ్గరకు వచ్చి వరుసగా వారి వద్ద నుంచి సంబంధిత పత్రాలను తీసుకొని టోకెన్‌లు వ్రాసి అనౌన్స్‌మెంట్ చేసి పేర్లను పలుకుతూ టోకెన్లను అందించారు. బయట మార్కెట్‌లో సోయా క్వింటాలుకు రూ.4000 నుంచి 4200 వరకు ఉండడంతో ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర రూ.5328 విక్రయించాలని రైతులు రావడంతో బారులు తీరారు. అనంతరం పీఏసీఎస్, సీఈవో కాంత్రికుమార్ రైతులను సముదాయించారు. అర్హులైన ప్రతిరైతుకు టోకెన్ అందించి సోయాదిగుబడులను కొనుగోలు చేస్తామని భరోసా కల్పించారు. దీంతో రైతులు సహకరించారు.

భైంసా : పట్టణ, మండల రైతాంగం సోయా టోకెన్ల కోసం గాను ఎగబడ్డారు. శనివారం భైంసాలో కొనసాగుతున్న మిర్జాపూర్ సహకార సంఘ కార్యాలయంలో సోయా టోకెన్ల పంపిణీ జరిగింది. ఇందుకోసం గాను పట్టణ, మండల పరిధిలోని రైతాంగం వేకువ జాము వేళలోనే టోకెన్ల పంపిణీ కేంద్రం వద్దకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పీఏసీఎస్ కార్యదర్శి రాజేందర్ సిబ్బందితో కలిసి టోకెన్ల జారీ కోసం గాను ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే టోకెన్ల కోసం వచ్చిన రైతుల నుంచి వారి వారి పట్టాదారు పుస్తకాలు, ఆధారుకార్డుల జిరాక్స్ ప్రతులను తీసుకొని వారందరిని పంపించి వేసారు. అనంతరం రైతుల నుంచి స్వీకరించిన జిరాక్స్ ప్రతుల ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంట వివరాలను పరిశీలించారు.


పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి



తహసీల్దార్ కమల్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కుంటాల, నవంబరు, 1 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలాన్ని ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినప్పటికీ మండలంలోని చాలా గ్రామాలలో రైతులు భూసమస్యలకు సంబంధించినటువంటి దరఖాస్తులన్నీ పెండింగ్‌లో ఉన్నాయని కుంటాల మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు పసుల నవీన్ అన్నారు. ప్రభుత్వం కుంటాల మండలాన్ని పైలట్ ప్రాజెక్టులో ఎంపిక చేసి మండల కేంద్రం కుంటాలలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వచ్చి ప్రారంభించినప్పటికీ దరఖాస్తులు మాత్రం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని, దరఖాస్తుల విషయమై తహసీల్దార్‌ను సంప్రదిస్తే ఆర్డీవోకు పంపామని చెబుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారన్నారు. మండలంలోని చాలా గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యల విషయమై తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక పక్క భూ భారతి చట్టంతో రైతులకు సంబంధించిన భూ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెబుతున్నప్పటికీ ఈ పథకంతో మండల ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల భూసమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కమల్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విట్టల్, రమణ, గాండ్ల బాబు ఉన్నారు.

గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పవార్ రామారావు పటేల్

లోకేశ్వరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్ లోకేశ్వరం మండలం పర్యటనలో భాగంగా శనివారం రోజున ఉదయం 9 గంటల నుండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్), ఐకేపీ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. లోకేశ్వరం మండల కేంద్రంతో పాటు అబ్దుల్లాపూర్, కనకాపూర్, వాస్తాపూర్, జోహర్‌పూర్, వట్టోలి, ధర్మోరా, పంచగుడి, మొహాల, రాయపూర్ కాండ్లీ, పుష్పూర్, కిస్టాపూర్, హవర్గా, మన్మథ్ గ్రామాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని వరి కొనుగోలు కేంద్రాల్లోని అమ్మాలని సూచించారు. దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. వరికి మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి 2,389, బి గ్రేడ్ రకానికి 2,369 ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, మాజీ చైర్మన్ చిన్నారావు, లోకేశ్వరం మాజీ సర్పంచ్ ఎం. శ్రీధర్, ఐకేపీ ఏపీఎం భోజన్న, లోకేశ్వరం బీజేపీ మండల అధ్యక్షుడు సాయన్న, రాజశేఖర్, సాయేందర్, ఐకేపీ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.